

# శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు వార్త

## జిల్లా సమాచార శాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా పి. వేణు గోపాల్ రెడ్డి



**నెల్లూరు కలెక్టరేట్, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త** అన్నమయ్య జిల్లా పుట్టపర్తిలో అడిషనల్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తూ ప్రభుత్వ ప్రమోషన్లలో నెల్లూరు జిల్లా సమాచార శాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా పి. వేణు గోపాల్ రెడ్డి, బదిలీ అయి నెల్లూరుకు రానున్నారు.

## రెవెన్యూ విభాగం వారాంతపు సమీక్ష : కమిషనర్



**నెల్లూరు కార్పొరేషన్, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త :** నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ నందన్ రెవెన్యూ విభాగం వారాంతపు సమీక్ష సమావేశాన్ని కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో మంగళవారం నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశంలో భాగంగా సర్వీస్ రిక్వెస్ట్ లను నిర్దేశించిన సమయంలో పూర్తి చేయాలని, అదేవిధంగా ఐ.జి.ఆర్.ఎస్ అప్లికేషన్లను బియాండ్ ఎస్.ఎల్.ఎ లోపు వెరిఫై చేసి నెక్స్ట్ లెవెల్ అధికారికి పంపించాలని సూచించారు. సచివాలయ పరిధిలోని నూతనంగా నిర్మించిన భవనాలు అదనపు అంతస్తులు నిర్మాణాలను ఖాళీ స్థలములను గుర్తించి టాక్స్ పరిధిలోకి తీసుకురావాలని ఆదేశించారు. డబుల్ ఎంట్రీ, నాట్ ట్రేస్డ్, రోడ్డు వైడనింగ్ కు సంబంధించిన అసెస్మెంట్ల లిస్టులను వెంటనే కార్యాలయానికి అందజేయవలసిందిగా ఆదేశించారు. లోక్ అదాలత్ నోటీసులు జారీ చేసిన వినియోగదారులందరూ శనివారం నేషనల్ లోక్ అదాలత్ కు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని, కోర్టు ప్రాంగణంలో ప్రత్యేక చెల్లింపు కౌంటర్లను ఏర్పాటు చేయవలసిందిగా రెవిన్యూ సిబ్బందిని ఆదేశించారు. నిర్దేశించిన టార్గెట్లను ప్రతి ఒక్క రెవెన్యూ విభాగం అధికారి, వార్డు సచివాలయ అడ్మిన్ కార్యదర్శులు వసూలు చేయాలని ఆదేశించారు. ఈ మధ్యకాలంలో మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ నందు 15 షాపుల యజమానులు బాడుగలు చెల్లించని కారణంగా దుకాణాలను సీజ్ చేసిన వారి వద్ద నుంచి 58 లక్షల రూపాయల బాడుగలు వసూలు చేసిన రెవెన్యూ ఇన్స్పెక్టర్ సీవీఎస్ కిరణ్ తో పాటు పలువురు ఆర్.ఐ లను ఈ సందర్భంగా అభినందించారు. అందరు రెవెన్యూ ఇన్స్పెక్టర్లు పూర్తిస్థాయిలో పనిచేయాలని, నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని కమీషనర్ ఆకాంక్షించారు. ఈ సమావేశంలో నెల్లూరు నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, రెవెన్యూ అధికారులు శ్రీనివాసులు, సమద్, మేనేజర్ రాజేశ్వరి, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు, వార్డు సచివాలయ అడ్మిన్ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఉల్లిపాయలను నిర్ణీత ధరకు విక్రయించండి



**నెల్లూరు అగ్రికల్చర్, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త** ఉల్లిపాయలను ప్రజలకు చౌకగా అందించే నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్న విషయం తెలిసిందే. మంగళవారం జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదేశాల మేరకు నెల్లూరులోని స్టోన్ హౌస్ పేటలో ఉన్న హోల్‌సేల్ ఉల్లిపాయల దుకాణాలను ప్రభుత్వ అధికారులు పరిశీలించారు. వీరిలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ఎన్.విజయ్ కుమార్, మార్కెటింగ్ శాఖ అసిస్టెంట్ డైరక్టర్ టి.అనిత కుమారి, నెల్లూరు రూరల్ సివిల్ సప్లైస్ డిప్యూటీ తహసీల్దార్ ఎస్కే జమీర్ భాష ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉల్లిపాయలను అధిక రేట్లకు విక్రయించకుండా కర్నూలు నుంచి సకాలంలో దిగుమతి చేసుకోవాలని వ్యాపారులకు సూచించారు.

## ఏసి ఏలక్ట్రిక్ బస్సులలో కూడా స్త్రీ శక్తి పథకం అమలయ్యే అవకాశం



**రాపూరు, సెప్టంబరు 9, ప్రభాతవార్త** త్వరలో రానున్న ఏసి ఎలక్ట్రిక్ బస్సులలో కూడా స్త్రీ శక్తి పథకం అమలయ్యే(మహిళలు ఉచిత ప్రయాణం) కూడా అమలయ్యే అవకాశం వుందని ఎపిఎస్ ఆర్టీసి యం.డీ సిహెచ్ ధ్వారకా తిరుమల రావు తెలిపారు. మంగళవారం ఆయన రాపూరు ఆర్టీసి డిపోను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆర్టీసి కాంపౌండ్ ప్రాంగణంలో ఆర్టీసి నెల్లూరు జోనల్ ఛైర్మన్ సన్నపురెడ్డి సురేష్ రెడ్డితో కలిసి మొక్కలు నాటారు. అనంతరం ఆయన గ్యారేజిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్టంలో స్త్రీశక్తి పథకం పక్క రాష్టాలతో పోలిస్తే ఇక్కడ విజయవంతంగా నడుస్తుందన్నారు. రాష్ట వ్యాప్తంగా వున్న 129 డిపోలలో 60 డిపోలలో ఆక్యుపెన్సి 100 దాటిందన్నారు. గతంలో 60% శాతం వుండగా ప్రస్తుతం 100% శాతం దాటిందన్నారు. కోన్ని డిపోలలో ఇది 150% శాతం వుందన్నారు. గతంలో మహిళలు 40% శాతం, పురుషులు 60 శాతం ప్రయాణిస్తుండగా, స్త్రీ శక్తి పథకం తరువాత 65% శాతం మహిళలు, 35% శాతం పురుషులు ప్రయాణిస్తున్నారన్నారు. దీంతో సంస్థకు రెవెన్యూ తగ్గిందన్నారు. అయితే ఈ నష్టాలను పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. ఈ పథకం విజయవంతంగా నడుస్తుందన్నారు. రాష్ట ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దీనిపై ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులును తిప్పుతున్నామన్నారు. ముఖ్యమంత్రి నిర్ణయం మేరకు త్వరలో 1050 కోత్త ఎలక్ట్రిక్ బస్సులు కోనుగోలు చేయాలని నిర్ణయించారన్నారు. ఇందుకు సంబంధించి ఆర్టీసి డిపోలలో హెచ్‌డీ లైన్ల ద్వారా ఛార్జింగ్ పాయింట్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇవి పూర్తి స్థాయిలో సిద్దం అయిన తరువాత మరో 1500 ఎలక్ట్రిక్ బస్సుల కోనుగోలుకు ప్రతిపాదనలు వున్నాయన్నారు. దీంతో పాటు ఆక్యూపెన్సి రేటు పెరిగినందున గ్యారెజిలో బస్సులకు సంబంధించిన విడిపరికరాలను సైతం పూర్తి స్థాయిలో సిద్దం చేస్తున్నట్లు తెలిపారు. అంతకు ముందు ఆయన డిపోలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ సిబ్బంది ప్రయాణికులతో మర్యాదగా మెలగాలని, వారిని గౌరవించాలని కోరారు. అలాగే కార్గోద్వారా ఆర్టీసి మంచి ఆదాయాలు వచ్చేలా సిబ్బంది చర్యలు చేపట్టాలని కోరారు. సిబ్బంది సంక్షేమం కోరకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా డిపోలో అత్యధిక కలెక్షన్‌లు, మైలేజి తిసుకువచ్చిన కండక్టర్‌లు, డ్రైవర్‌లకు, మంచి ప్రతిభ కనపరిచిన డిపో సిబ్బందికి, గ్యారేజ్ సిబ్బందికి నగదు బహుమతులు, ప్రశంశా పత్రాలను ఆయన ఆందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసి నెల్లూర జోనల్ ఛైర్మన్ సన్నపురెడ్డి సురేష్ రెడ్డి, ఆర్టీసి నెల్లూరు ఇడీ నాగేంద్ర ప్రసాద్, డిపిటిఓ షమీమ్, రాపూరు డిపో మేనేజర్ అనీల్ కుమార్,డిపోలోని పలు యూనియన్‌లకు చెందిన కార్మికులు, డిపో సిబ్బంది, గ్యారేజ్ సిబ్బంది తదితరులున్నారు.

## జాతీయ రహదారిపై స్వచ్ఛంధంగా ఆక్రమణలు తొలగించకుంటే చర్యలు - ఛైర్‌పర్సన్ మోర్ల సుప్రజా మురళీ



**బుచ్చి సెప్టెంబర్ 9 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయితీలో జాతీయ రహదారిపై స్వచ్ఛంధంగా ఆక్రమణలు తొలగించాలని అందుకు మరో 2 రోజులు టైం ఇవ్వడం జరిగిందని ఛైర్‌పర్సన్ మోర్ల సుప్రజా మురళీ తెలిపారు. కౌన్సిల్ అత్యవసర సమావేశంలో ఆమె మాట్లాడుతు రానున్న వర్షాకాలం దృష్టిలో పెట్టుకొని డ్రైనేజి కాలువలు పూడికతీత కోసం ఆక్రమణలు తొలగిస్తున్నట్లు ఆమె తెలిపారు. వ్యాపారస్తులు స్వచ్ఛంధంగా ఆక్రమణలు తొలగించకుంటే మున్సిఫల్ సిబ్బంది ద్వారా వచ్చి ఆక్రమణలు తొలగిస్తామని హెచ్చరించారు. పీర్ల కాలువ వద్ద నుండి జెండాదిబ్బ రోడ్డు వరకు ముంబాయి రోడ్డుకి ఇరువైపుల ఆక్రమణలు తొలగించనున్నట్లు ఆమె తెలిపారు. కెఎం హాస్పటల్ వద్ద నుండి రాఘవరెడ్డి కాలనీ వరకు కాలువ పూడికతీతకు 10 లక్షలు వెచ్చిస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో కమీషనర్ బాలకృష్ణ, కౌన్సిలర్లు పాల్గోన్నారు.

## సోమశిల నీటిమట్టం



**అనంతసాగరం, సెప్టెంబరు 9, ప్రభాతవార్త :** మండలంలోని సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి మంగళవారం సాయంత్రానికి 19510 క్యూసెక్కుల వంతునవరద ప్రవాహం నమోదైంది. జలాశయం పూర్తిసామర్థ్యం 78 టిఎంసిలు కాగా ప్రస్తుతం జలాశయం లో 70.230టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఎస్ఎఫ్‌సికి 250, ఎన్ఎఫ్‌సికి 400, పెన్నా డెల్టాకు1000, కండలేరు వరద కాలువకు 0 క్యూసెక్కులు వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 99.518మీటర్ల మేర నీటిమట్టం నమోదైందని జలాశయం అధికారులు తెలిపారు.

## రూ. 20 కోట్లతో ముత్తుకూరు పంచాయితీ అభివృద్ధి

- అధికారంలో ఉన్నా, లేకున్నా ప్రజల కోసమే పనిచేస్తున్నా..
- సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి



**ముత్తుకూరు, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త** ముత్తుకూరు పంచాయితీలో రూ. 20 కోట్లతో అభివృద్ధి చేసామని, అధికారంలో ఉన్నా, లేకున్నా ప్రజల కోసమే పనిచేస్తున్నానని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మాట్లాడుతూ 2016లోనే ముత్తుకూరులో క్రికెట్ స్టేడియం నిర్మాణానికి భూమి మంజూరు చేయించానన్నారు. అప్పట్లోనే వైసీపీ నేతల ప్రోద్భలంతో కోర్టు తెచ్చి స్టేడియం నిర్మాణానికి అడ్డుతగిలారన్నారు. ఇప్పుడు మరో స్థలంలో రూ. 2.50 కోట్లతో అదానీ కృష్ణపట్నం పోర్టు సహకారంతో స్టేడియం నిర్మించబోతున్నామన్నారు. పీ4 లో భాగంగా అదానీ ఫౌండేషన్ ముత్తుకూరులో అనేక అభివృద్ధి పనులను చేపట్టిందన్నారు. రూ.2.50 కోట్లతో శ్మశానం, రూ 2.80 కోట్లతో డ్రైన్ల నిర్మాణం చేయడంతో పాటు రూ.3.50 కోట్లతో 430 సోలార్ వీధిలైట్లు ఏర్పాటు చేయబోతోందన్నారు. గురుకుల పాఠశాలలో వసతుల కల్పనకు కూడా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రిలయన్స్ కోస్ట్ గార్డ్ రోడ్డు రూ.70 లక్షలతో నిర్మాణం జరుగుతోందన్నారు. ముత్తుకూరు మండలంలో సిమెంట్ రోడ్ల నిర్మాణానికి రూ.2 కోట్లు మంజూరు చేయించానన్నారు. కృష్ణపట్నం దేవస్థానాల నిధులు రూ. 5 కోట్లతో ముత్తుకూరులో కళ్యాణ మండపం నిర్మించే ప్రయత్నంలో ఉన్నారన్నారు. కళ్యాణ మండపం విషయంలోనూ వైసీపీ నేతలు కోర్టు స్టే తెచ్చారు కంపెనీల సీఎస్ఆర్ నిధులను వీలైనంత వరకు ఈ ప్రాంతంలోనే ఖర్చు చేసేలా ప్రయత్నిస్తున్నారన్నారు. కంపెనీ ఒక్కో మినరల్ వాటర్‌ను రూ.32 లక్షలు వెచ్చించి నిర్మిస్తోంది. 42 మినరల్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని కోరారు. పొదలకూరు, వెంకటాచలం సామాజిక ఆరోగ్య కేంద్రాలకు రూ.1.90 కోట్ల విలువైన పరికరాలను ఎస్ఈఐఎల్ కంపెనీ సమకూర్చిందన్నారు. గిరిజన కాలనీలను పామాయిల్ ఫ్యాక్టరీ యాజమాన్యాలు దత్తత తీసుకునే ప్రక్రియ జరుగుతోందన్నారు. ముత్తుకూరు జెడ్పీ ఉన్నత పాఠశాలను బీపీసీఎల్ సహకారంతో రూ.7.50 కోట్లతో అభివృద్ధి చేసే ప్రక్రియ నడుస్తోందన్నారు. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ప్రజలకు వీలైనంత మంచి చేయడమే నా లక్ష్యమన్నారు. అలా కాకుండా నిత్యం పారేసుకోవడం, దివంగతులైన తల్లిదండ్రులను దూషించడం లాంటి పనికిమాలిన పనులు చేసారన్నారు. ఆ పనులు చేసిన వారు ఎలాంటి ఫలితాలు అనుభవించారో అందరూ చేశారన్నారు. నా తల్లిదండ్రులతో పాటు చంద్రబాబు నాయుడు తల్లిదండ్రులను ఉద్దేశించి వాడిన భాష జీవితంలో మరిచి పోలేమన్నారు. అది మనుషులు వాడే భాష కాదువీధుల్లోకి వచ్చి ఎన్ని రంకెలు వేసినా దేవుడు చూస్తున్నాడన్నారు. అంతా ఆయనే చూసుకుంటారన్నారు. ప్రజలు 11 సీట్లకు పరిమితం చేయడంతో అయోమయ పరిస్థితిలో ఉన్న వైసీపీ నాయకులు ధర్నాల పేరుతో డ్రామాలేసుకుంటున్నారు. తల్లిదండ్రులను దూషించడం వంటి పనికిమాలిన పనులు చేసే వ్యక్తిని జిల్లా అధ్యక్ష పదవి నుంచి తప్పించి మనిషిగా ప్రవర్తించే వారిని ఆ స్థానంలో కూర్చోబెట్టుకోవాలని వైసీపీ కార్యకర్తలకు హితవు పలుకుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు నీలం మల్లికార్జున యాదవ్, కృష్ణపట్నం సొసైటీ అధ్యక్షులు పలంరెడ్డి రామ్మోహన్ రెడ్డి, స్థానిక నాయకులు ఈదురు రామ్ ప్రదీప్ కుమార్ రెడ్డి, మునుకూరు రవికుమార్ రెడ్డి, రాగల శివకృష్ణ. కృష్ణపట్నం దేవాలయాల చైర్మన్ మావుడా శ్రీనివాసులు, నన్నం దీనయ్య, తిరుమల శెట్టి సతీష్. ఆలిముత్తు, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి మాచిరెడ్డి శ్రీధర్ రెడ్డి, క్రికెట్ నిర్వాహకులు రవి, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఉల్లిపాయకు ఉలుకూ పలుకూ లేదు

- రైతు బజార్లలో నాసిరకం సరుకు
- మందకోడిగా సాగుతున్న ఉల్లిపాయల విక్రయాలు
- ఒక మెట్రిక్ టన్నుకు 250 కేజీల నాసిరకం ఉల్లిపాయలు





**నెల్లూరు అగ్రికల్చర్, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త** ప్రభుత్వం ఎంతో సదుద్దేశంతో తక్కువ ధరకే ఏర్పాటు చేసిన ఉల్లిపాయల విక్రయ కేంద్రాలు అదిలోనే హంస పాదులా తయారయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. రాష్ట్రంలో ఉల్లిపాయల దిగుబడి ఈ ఏడాది అధిక మొత్తంలో రాగా వాటిని విక్రయించి సొమ్ము చేసుకునేందుకు రైతులు అనేక పాట్లు పడుతున్నారు. కర్నూలులో ఉల్లిగడ్డల సాగు విస్తీర్ణం పెరగడం, దాంతో దిగుబడి కూడా ఆశించిన స్థాయి కన్నా అధికంగా రావడంతో విక్రయాలు కూడా అంతంత మాత్రంగా ఉన్నాయి. దీంతో ప్రభుత్వం కర్నూలులో రైతు వద్ద ఒక మెట్రిక్ టన్ను ఎర్రగడ్డలు రూ.25వేలకు కొనుగోలు చేసి ఒక కేజీ 12 రూపాయలకే సబ్సిడీపై ప్రజలకు అందిస్తోంది. ఈ నేపథ్యంలో నెల్లూరు రైతు బజార్లలో 12 రూపాయలకే ఒక కేజీ ఎర్ర గడ్డలు ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. బహిరంగ మార్కెట్లో ఒక కేజీ ఉల్లిపాయలు రూ.25లకు విక్రయాలు జరుగుతుండగా, నెల్లూరులోని నవాబుపేట రైతు బజారు, పత్తేఖాన్ పేట రైతు బజార్లలో ఈ విక్రయాలు కొనసాగుతున్నాయి. అంత వరకు భాగానే ఉన్నా, సరుకు నాణ్యత ఆశించిన లక్ష్యానికి విఘాతం కలిగిస్తోంది. ప్రభాతవార్త ఫత్తేఖాన్ పేట రైతు బజార్‌లో మార్కెటింగ్ శాఖ నిర్వహిస్తున్న ఉల్లిపాయల విక్రయ కేంద్రాన్ని మంగళవారం సందర్శించగా, అక్కడ అంతా వాడిపోయిన ,కుళ్ళిపోయిన నల్లమచ్చతో కూడిన నాసిరకం ఉల్లి సరుకు దర్శనమిస్తోంది. రేటు తక్కువని అవి కొనేందుకు వచ్చిన ప్రజలు నాసిరకంగా ఉండడంతో వెనుతిరిగి వెళ్తున్నారు. ప్రభుత్వం తక్కువ రేటు అంటూ పెట్టిన ఉల్లి సరుకు ఇంత దరిద్రంగా ఉంటుందా, అంటూ కొనుగోలు చేసేందుకు నిరాకరిస్తున్నారు. సరుకు నాసిరకంగా ఉండడంతో ఒక మెట్రిక్ టన్ను ఉల్లిపాయల్లో 250 కేజీల సరుకు ఎందుకు పనికి రాకుండా పోతుంది. ప్రభుత్వం మాత్రం ఎంతో సదుద్దేశంతో ఎర్రగడ్డలను ప్రజలకు తక్కువ రేటుకు అందుబాటులోకి తెచ్చామని చెబుతుండగా రైతు బజార్లకు నాసిరకం సరుకు అందించడంతో ఆశించిన లక్ష్యం నీరుగారుతోంది. మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులు కొత్తగా నియమితులైన మార్కెటింగ్ కమిటీ ఛైర్మన్ మనుబోలు శ్రీధర్‌రెడ్డి దీనిపై దృష్టి సారించి మార్కెటింగ్ శాఖ ఏర్పాటు చేసిన ఉల్లిపాయల విక్రయ కేంద్రాలను సందర్శించి నాణ్యతను పరిశీలించాల్సిన అవసరం ఉంది. ఆగష్టు 30న మార్కెటింగ్ శాఖ 12 రూపాయలకే ఉల్లిపాయలంటూ రైతు బజార్లలో దుకాణాలను ఏర్పాటు చేసి ఉల్లిపాయల విక్రయ కేంద్రాలను ప్రారంభించింది. ఇప్పటి వరకు ఫత్తేఖాన్ పేట, రైతు బజార్‌కు నాలుగు టన్నుల ఉల్లిపాయలు రాగా, మంగళవారానికి మూడు టన్నుల విక్రయాలు జరిగాయి. అందులో 750 కేజీల ఉల్లిపాయలు నాసిరకమైనవిగా తేలాయి. రైతు బజార్లలో విక్రయించే ఉల్లిపాయల నాణ్యతపై ప్రభుత్వం, పాలకులు, పునరాలోచించి నాణ్యమైన ఉల్లిపాయలను అందించి విక్రయాలు సాగించాలని నెల్లూరు నగర ప్రజలు కోరుతున్నారు.

## దద్దరిల్లిన అన్నదాత పోరుబాట

- కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించిన వైసిపి రైతులు
- కాకాణి ఆధ్వర్యం లో రైతుపోరు బాట,భారీగా పాల్గొన్న రైతులు
- అడ్డుకోవాలని చూసిన పోలీసులు
- దాటుకుని వెళ్లిన రైతులు
- వైసీపీ హయంలో రైతులు ఏ నాడు రోడ్డెక్కలేదు
- 270-రూపాయల యూరియా 700-రూపాయలకు అమ్ముతున్నారు
- వైసీపీ హయాంలో 25 వేల వరకు పలికిన ధర
- ఇప్పుడు 15 వేలు కూడా పలికే పరిస్థితి లేదు
- మాజీమంత్రి కాకాని గోవర్ధన్



**నెల్లూరు కలెక్టరేట్, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త** వైఎస్ఆర్సిపి పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా రైతులకు మద్దతుగా రైతు సమస్యలపై అన్నదాత పోరుబాట అనే కార్యక్రమం నిర్వహించారు, దీనిలో భాగంగా నెల్లూరు నగరంలో వైఎస్ఆర్సిపి పార్టీ జిల్లా అధ్యక్షులు మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో నెల్లూరు నగర,రూరల్, కోవూరు, సర్వేపల్లి నియోజక వర్గాలకు సంబంధించిన రైతులు నాయకులతో కలిసి ఈ అన్నదాత పోరుబాట కార్యక్రమం జరిగింది. ఆయా నియోజక వర్గాల ఇంచార్జీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నెల్లూరు విఆర్సి సెంటర్ నుండి కలెక్టర్ కార్యాలయం వరకు భారీగా ర్యాలీ నిర్వహించిన వైఎస్సార్సీపీ పార్టీ శ్రేణులు నెల్లూరు జిల్లా జాయింట్ కలెక్టర్ కార్తీక్ కు రైతు సమస్యలపై వినతి పత్రం సమర్పించారు, అనంతరం కాకాని గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ వైఎస్ఆర్సిపి ప్రభుత్వం అధికారంలో ఉన్న రోజుల్లో రైతులు యూరియా కోసం కానీ, గిట్టుబాటు ధరల కోసం కానీ, విత్తనాల కోసం కానీ, పంట నష్టానికి చెల్లించే నష్ట పరిహారం కోసం కానీ ఏనాడు రోడ్డు ఎక్కలేదని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులను గాలికి వదిలేసారనీ రైతులకు 270/- రూపాయలకు దొరకాలిసిన యూరియా బస్తా 700/- రూపాయలకు ప్రైవేట్ మార్కెట్లో అమ్మేస్తున్నారని సభల్లో రైతులకు యూరియా అందిస్తామని చెబుతున్న కూటమి నేతలు వాస్తవ రూపంలో ఆ పని చేయటం లేదని ప్రైవేట్ వ్యక్తులతో చేతులు కలిపి కోట్ల రూపాయల యూరియాను ప్రైవేటు వ్యక్తులకు అమ్మేస్తున్నారనీ కాకాని గోవర్ధన్ రెడ్డి కూటమి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు, ఈ కార్యక్రమంలో రైతుల తో పాటు ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, జడ్పిటిసి ఆనం అరుణమ్మ, ఆనం విజయ్ కుమార్ రెడ్డి, నల్లపురెడ్డి రజిత్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## కోతలు లేకుండానే ఆపరేషన్ చేయడం మా ప్రత్యేకత

RIVEA VASCULAR INSTITUTE



**నెల్లూరు సెప్టెంబర్ 9, ప్రభాతవార్త** మహిళల్లో ఫైబ్రాయిడ్స్, పురుషుల్లో ప్రోస్టేట్ గ్లాండ్ వాపు వంటి వివిధ వ్యాధులకు కోతలు లేకుండానే ఆపరేషన్ చేయడం RIVEA వేస్కులర్ ఇన్స్టిట్యూట్ ప్రత్యేకత అని ప్రముఖ వైద్యులు, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి తనయులు డాక్టర్ అర్జున్ రెడ్డి అన్నారు. మంగళవారం విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నెల్లూరు, కావలి బ్రాంచ్ల ఆధ్వర్యంలో జరిగిన డాక్టర్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం చాలాచోట్ల కోతలు పెడుతూ వైద్యసేవలు అందిస్తున్నారని, వాటన్నింటికి భిన్నంగా చిన్న పిన్ సైజ్ హోల్ ద్వారా ట్రీట్మెంట్ ఇవ్వనున్నట్లు చెప్పారు. మహిళలు తమ జీవిత కాలంలో 60 శాతం ఫైబ్రాయిడ్స్ వల్ల ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. గతంలో ఇలాంటి జబ్బులకు సర్జరీలు చేసేవారిని, ఇకపై అలా లేకుండా కేవలం చిన్న సైజు హోల్ ద్వారా ట్రీట్మెంట్ ఇస్తామన్నారు. ఈ ట్రీట్మెంట్ ద్వారా రోగులు చాలా వేగంగా కోలుకోవడంతో పాటు వెంటనే వారి పనులు వారు చేసుకునే విధంగా ఉంటుందన్నారు. ఈ సీఎంఈ ద్వారా ప్రజలకు ఈ చికిత్స విధానాలపై మరింత అవగాహన ఏర్పడుతుందన్నారు. RIVEA ఇన్స్టిట్యూట్లో వ్యాస్క్యులర్ డిపార్ట్మెంట్ ద్వారా అత్యుత్తమ వైద్య సేవలు అందించినట్లు అర్జున్ రెడ్డి తెలిపారు. అడ్వాన్స్డ్ ఇమేజింగ్ ఆపరేషన్ థియేటర్ ను ఇన్స్టిట్యూట్లో ఏర్పాటు చేసినట్లు చెప్పారు శిజునితి వేస్కులర్ ఇన్స్టిట్యూట్ అనేది ఈ తరహాలో దేశంలోనే మొట్టమొదటి హాస్పిటల్ గా వెల్లడించారు. అడ్వాన్స్డ్ వరల్డ్ క్లాస్ ఫుడ్ కేర్ ట్రీట్మెంట్ హాస్పిటల్ అందించినట్లు వెల్లడించారు. **డాక్టర్ మహమ్మద్ అలీ మాట్లాడుతూ..** దేహంలో ఎలాంటి సర్జరీ లేకుండా మూసుకుపోయిన రక్తనాళాలను సరిచేసి రక్త సరఫరాను మెరుగుపరచడమే లక్ష్యంగా ఇన్స్టిట్యూట్ పనిచేస్తుంది తెలిపారు. బోధ కాలుకు చికిత్స అందించి సరి చేసే ఏకైక ఇన్స్టిట్యూట్ ఇదేదని స్పష్టం చేశారు. దేశంలో సంవత్సరానికి 20 లక్షల మందికి డయాబెటిస్ కారణంగా కాళ్ల తొలగించాల్సి వస్తుందని, అందులో మార్పు తీసుకొచ్చే విధంగా వేస్కులర్ సర్జరీలు చేస్తామన్నారు. గుండెకు రక్త సరఫరా అందించే రక్తనాళాలు మూసుకుపోయినా ఈ ట్రీట్మెంట్ ద్వారా సరి చేయవచ్చని వెల్లడించారు.

## పాలన ఇలాగే సాగితే ప్రజలే దించేస్తారు - వైఎస్ఆర్‌సిపి నాయకులు






**ఆత్మకూరు ,సెప్టెంబరు9,ప్రభాతవార్త :** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఏ పంటలు పండిస్తున్న రైతన్నలకడు కూడా గిట్టుబాటు ధర కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యారని ఏడాది పాలనలో ప్రతిపక్ష వైఎస్ఆర్‌సిపి ప్రజల తరపున ప్రశ్నిస్తుంటే వారిని అడ్డుకోవడం, కేసులు పెట్టడంతోనే సరిపోయిందని, ఇలాగే పాలన కొనసాగిస్తే నేపాల్ తరహాలో ప్రజలే కూటమి ప్రభుత్వాన్ని దింపేస్తారని ఆత్మకూరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. వైఎస్ఆర్‌సిపి రాష్ట్ర అధ్యక్షుడు , మాజీముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పిలుపుమేరకు నియోజకవర్గంలో రైతు నాయకులు, ప్రజలు, వైసిపి నాయకులు , కార్యకర్తలు , ప్రజాప్రతినిధులతో కలిసి అన్నదాత పోరు కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. తొలుత మున్సిపల్ బస్టాండ్‌లోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నాయకులతో కలిసి రైతులకు న్యాయం చేయాలని ఆర్‌డిఓ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్ళి ఆర్‌డిఓ పావనికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతులకు ఏ సహకారం అందిస్తుందో అర్థం కాకుండా ఉందని ,కేంద్రం నుంచి వచ్చిన యూరియా ప్రస్తుతం రైతులకు ఎందుకు అందుబాటులో లేకుండా పోయిందన్నారు. రైతులు బ్లాక్ మార్కెట్‌లో యూరియా కొనాల్సిన దుస్థితికి ఎందుకు తీసు కొచ్చారని ప్రశ్నించారు.అన్నదాతలు సాగుచేసిన ఏ పంటకు కూడా మీరు గిట్టుబాటు ధర కల్పించకుండా పోయారని, వరికోతలు ముగిసినా ధాన్యం కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో రైతులు 14వేలకు తెగనమ్ముకొని నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. గత వైఎస్ఆర్‌సిపి ప్రభుత్వంలో జగన్మోహన్‌రెడ్డి ధాన్యం రైతులకు 23వేలు గిట్టుబాటు ధర అందించారని, ప్రతిపంట సాగుచేసిన రైతుకు విత్తు నుంచి విక్రయం వరకు అన్నింటా తోడుగా నిలిచి వ్యవసాయాన్నిపండుగ చేశారని, ఇన్‌పుట్ సబ్సిడీ ఏ సీజన్‌లో పరిహారం , రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు ప్రతినిత్యం అందుబాటులో ఉండేలా వ్యవస్థను రూపొందించారని ప్రస్తుతం రైతులకు ఆపరిస్థితి లేదన్నారు. రాష్ట్రంలో 40శాతం మంది ప్రజలు వైఎస్ఆర్‌సిపి నమ్మి ఓట్లు వేశారని , కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసేంతవరకు ప్రజల తరపున ఇలాంటి పోరాటాలు సాగిస్తూనే ఉంటామన్నారు. కూటమి పాలకులు తాము ప్రజల తరపున పోరాటాలు చేసేందుకు పూనుకుంటేనే ప్రజలకడు మంచి చేసే ఆలోచన చేస్తున్నారని , ప్రశ్నిస్తేనే కూటమి పాలకుల్లో చలనం వస్తుందని , తాము జగన్మోహన్‌రెడ్డి నాయకత్వంలో నిరంతరం ప్రజల కోసం పోరాటాలు సాగిస్తూనే ఉంటామన్నారు.కూటమి ప్రభుత్వం వైఎస్ఆర్‌సిపి నాయకులపై పెడుతున్న అక్రమ కేసులు , చేస్తున్న నిర్భంధాలు , అడుగడుగునా సృష్టిస్తున్న ఆటంకాలతో ప్రజల కోసం చేసే ఏ కార్య క్రమా న్ని ఆపలేమన్నారు. ప్రతిఒక్కరికి అండగా నిలుస్తూ ప్రజా క్షేత్రంలో నిత్యం పోరాటం సాగిస్తూ వారికి రావాల్సిన ప్రతి ఒక్కటి చేకూరేలా చేస్తామన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా వైసిపి ఉపాధ్యక్షులు డాక్టర్ సి.హెచ్. ఆదిశేషయ్య, రాష్ట్ర వైసిపి నాయకుడు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, ఆత్మకూరు పట్టణ వైసిపి అధ్యక్షుడు నాగులపాటి ప్రతాప్‌రెడ్డి, మండల వైసిపి కన్వీనర్ ఎస్.చెన్ను వెంకటేశ్వరరెడ్డి, జి.పిచ్చిరెడ్డి,ఎస్.శంకర్‌రెడ్డి, జిల్లా వైసిపి యాక్టివిస్ట్ కార్యదర్శి ఎస్.కె.జనార్ధన్‌రెడ్డి, సి.శ్రీనివాసులు,ఆత్మకూరు రూరల్ వైసిపి కన్వీనరల్స్ ఎస్.జితేంద్రనాథ్‌రెడ్డి,అందరు జడ్పీటిసి సభ్యులు,ఎంపిపిలు,నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## డాక్టర్ బిఎస్ఆర్ ఐటిఐ కాలేజీలో ఎంఎన్‌సి సంస్థల జాబ్‌మేళా నేడే

**ఆత్మకూరు ,సెప్టెంబరు9,ప్రభాతవార్త :** ఆత్మకూరులోని డాక్టర్ బిఎస్ఆర్ ఐటిఐ కాలేజీలో బుధవారం ఉదయం 9నుండి 2గంగలకు ఎంఎన్‌సి సంస్థల జాబ్‌మేళా జరుగుతుందని కాలేజీ ప్రిన్స్‌పాల్ తెలిపారు. ఐటిఐ, డిప్లొమా, బి.టెక్ విద్యార్థులతోపాటు 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ పాస్ అయిన వారు అర్హులన్నారు. ఈమేళాలో శ్రీసిటీ, బెంగుళూరు, హైదరాబాద్‌ల నుండి పలు సంస్థలు పాల్గొంటారన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోఆర్డినేటర్ అండ్ టీమ్ డాక్టర్ బిఎస్ఆర్ ఐటిఐ కాలేజీ వారు కోరారు. జాబ్‌మేళా నిర్వహించిన అనంతరం సెలెక్టెడ్ లిస్టను తెలియజేస్తామని వారు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

## మోతాదులో వాడకం పంటకు ప్రయోజనం : ఏడీఏ



**విజయమూరు, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త :** వింజమూరు వ్యవసాయశాఖ సబ్ డివిజన్ పరిధిలోని రైతులు పంటలకు మోతాదులో యూరియా వాడకం పంటకు ప్రయోజనకరమని వింజమూరు వ్యవసాయశాఖ ఏడీఏ శేషగిరిరావు తెలిపారు. మంగళవారం మండలంలోని చాకలికొండ గ్రామ సచివాలయంలో మండల వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో యూరియా అధిక వాడకం వలన కలిగే అనర్ధాలను తెలియ జేసేందుకు రైతులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూరియాను అధికంగా వాడడం వలన పంటకు చీడపీడలు ఆశించి భూమి నిస్సారమవుతుందని అందుచేత భూమి ఆరోగ్యాన్ని కాపాడేందుకై జీవ ఎరువులు నువ్వు సేంద్రియ ఎరువులను వాడాలన్నారు. యూరియా అధికంగా వాడడం వలన మొక్కలు పొడవుగా పెరిగి బలహీనమవుతాయని తెలిపారు. ఆకులు ఎక్కువగా పెరిగి గింజ శాతం తగ్గుతుందన్నారు. పురుగు వ్యాధి దాడి ఎక్కువవుతుందని తెలిపారు. నేల భూసారం కూడా తగ్గిపోయి మీరు పర్యావరణం కలుషితం అవుతుందని తెలిపారు. రైతుకు ఖర్చు పెరిగి రైతు లాభాలు తగ్గుతాయి తెలిపారు. రైతులు వ్యసాయశాఖ అధికారులు సిఫార్సు మేరకు యూరియాను ఉపయోగిస్తే నాణ్యమైన పంట దిగుబడి పొందవచ్చు తెలిపారు. మండల వ్యవసాయాధికారి వాసు మాట్లాడుతూ తక్కువ మోతాదులో యూరియాను ఉపయోగించడం వల్ల పంటలో పిలకలు సమృద్ధిగా ఏర్పడి, గింజ ఉత్పత్తికి దోహదపడుతుందన్నారు. వేర్లు బలంగా పెరిగి మొక్క నేలలో గట్టిగా స్థిరంగా నిలబడి పోషకాలు, నీటిని సమర్ధంగా గ్రహిస్తాయని తెలిపారు. పేడలను అరికట్టడంలో నత్రజని నాన్ యూరియా ఎరువులను వాడినట్లయితే భూమి ఆరోగ్యవంతంగా ఉంటుందన్నారు. ఏపీసీఎన్ఎఫ్ ప్రత్యామ్నాయంగా పొలంలో చల్లుకోవాల్సిందిగా ఆయన తెలిపారు. పీఎండీఎస్ కిట్లను 10 కేజీలు 650 రూపాయలకు సరఫరా చేస్తున్నట్లు ఆయన తెలిపారు. డివిజనల్ అధికారి అంజిరెడ్డి మాట్లాడుతూ రసాయన ఎరువులు పురుగు మందులు వాడి పండించిన పంటలను ఆహారంగా తీసుకున్నప్పుడు వారికి అనేక అనారోగ్య పరిస్థితులు కలుగుతాయని అన్నారు. పంటకు వచ్చు చీడపీడలను నియంత్రించేందుకు ప్రకృతి సిద్ధమైన పోషకాలు, పురుగులు తెగుళ్ల నివారణ ప్రత్యామ్నాయంగా కషాయాలు ఏపీసీఎన్ ఆఫ్ సంస్థ వద్ద సిద్ధంగా ఉన్నాయన్నారు. రైతులందరూ విధిగా తాము వేసిన పంటలను నమోదు చేసుకోవాలని, దాని ద్వారా వ్యవసాయ పరికరాలు విత్తనాలు ఎరువులు సరఫరా చేయబడతాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఏఏ శారద, ఏపీ సీఎన్ఎఫ్ సిబ్బంది, రైతులు తదితరులు ఉన్నారు.

## మెట్టుకూరుని కలిసిన సీతారామపురం నేతలు



**సీతారామపురం సెప్టెంబర్ 9 ప్రభాతవార్త :** నెల్లూరుజిల్లా సహకార బ్యాంకు చైర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డిని సీతారామపురం మారం రెడ్డిపల్లి సొసైటీ అధ్యక్షులు సోమన బోయిన రాజశేఖర్ మంగళవారం నెల్లూరులోని డిసిసిబి కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి శాలువా కప్పి పుష్పగుచ్చం అందజేశారు. నెల్లూరులోని డిసిబిసి కార్యాలయంలో జిల్లాలోని అన్ని మండాలల సొసైటీ అధ్యక్షులతో ఏర్పాటు చేసిన సమావేశంలో సీతారామపురం సొసైటీ అధ్యక్షులు సోమన బోయిన రాజశేఖర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ ధనుంజయరెడ్డి ,రాజశేఖర్‌కి అభినందనలు తెలిపారు.అనంతరం ధనుంజయరెడ్డి మాట్లాడుతు మండలంలోని రైతులకు అందుబాటులో వుండి సేవలందించాలన్నారు. మండలంలోని రైతులను ఆదుకునే రుణాలను మంజూరు చేయాలని ఆదే విధంగా సొసైటీ కాంప్లెక్స్ గదులు నిర్మాణం ప్రతిపాదనను అంగీకరించి త్వరితగతిన నిర్మాణంలను పూర్తి చేయాలన్నారు.ఈకార్యక్రమంలో మండల టిడిపి కన్వీనర్ కప్పా ప్రభాకర్‌రాజు,మండల జనసేన నాయకుడు బోగినేని కాశీరత్తయ్య, హైస్కూల్ చైర్మన్ తోట ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసి యండీ ద్వారకా తిరుమలరావుకు చెన్ను అశోక్ సత్కారం



**రాపూరు,సెప్టంబరు 9 ప్రభాతవార్త :** ఎపియస్ ఆర్టీసి యండీ సిహెచ్. ద్వారకా తిరుమల రావును మంగళవారం రాపూరు మండల తెలుగుదేశం పార్టీ యువనాయకుడు చెన్ను అశోక్ రెడ్డి ఘనంగా సత్కరించారు. రాపూరు డిపో సందర్శనకు వచ్చిన యండీ ద్వారకా తిరుమల రావును కలసిన చెన్ను అశోక్ రెడ్డి ఆయనకు, నెల్లూరు జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్ రెడ్డికి శాలువా కప్పి ఘన సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన డిపోకు సంబందించిన పలు సమస్యలను యండీ ద్వారకా తిరుమల రావు దృష్టికి తీసుకువచ్చారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించారు. జనసేన మహిళా నాయకురాలు కొండాపురం కస్తూరి ఆర్టీసి యండీ ద్వారకా తిరుమల రావును ఘనంగా సత్కరించారు. బిజేపి నాయకుడు గాలి అంకబాబు,జనసేన నాయకుడు జల్లెళ్ల రాజేష్‌లు సైతం ఆర్టీసి యండీ, నెల్లూరు జోనల్ చైర్మన్‌లను సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ నాయకులు నల్లవడ్ల వెంకటరమణా రెడ్డి, మూరంరెడ్డి మధుసూధన్ రెడ్డి తదితరులున్నారు.

## వసతి గృహాలను సందర్శించిన జిల్లా సాంఘిక సంక్షేమ అధికారిణి



**వింజమూరు, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త :** వింజమూరులోని సాంఘిక సంక్షేమ వసతి గృహాలను మంగళవారం జిల్లా సాంఘిక సంక్షేమ మరియు సాధికారిక అధికారిణి కే.శోభారాణి సందర్శించారు. వింజమూరులోని ఎస్సీ బాలికల బాలుర వసతి గృహాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో భోజనం మెనూ ప్రకారం అందుతుందా లేదా అని వసతులు సరిగా ఉన్నాయా లేదా అని ఆరా తీశారు. ఈ సం దర్భంగా పదో తరగతి చదువుతున్న విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలని అందుకు తగిన విధంగా చదవాలన్నారు. బాలికల వసతి గృహంలోని విద్యార్థినులతో కలిసి అల్పాహారం తీసుకున్నారు. అనంతరం స్థానిక వివేకానంద కళాశాలలో సచివాలయ వెల్ఫేర్ సహాయకులు కళాశాల ప్రిన్సిపాల్‌తో నిర్వహించిన కార్యక్రమంలో పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్ దరఖాస్తులు, ఆరు దశల ప్రక్రియను వివరించారు. అందులో నాలుగు చక్రాల వాహనం ఉండకూడదని మెట్ట పది ఎకరాల లోపు మాగాని రెండున్నర ఎకరాల లోపు ఉండాలని అన్నారు. ఆదాయ పన్ను చెల్లించేవారు అనర్హులు తెలిపారు. అలాగే 300 యూనిట్లు లోపు విద్యుత్ వినియోగం ఉండాలన్నారు. పట్టణంలో 1500 చదరపు అడుగులు నివాస స్థలంలోపు ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జయంత్‌రెడ్డి, ఏఎస్‌డబ్ల్యూఓ కే.రమణారెడ్డి, సంక్షేమ అధికారులు భారతి భాస్కర్‌లు, విద్యార్థినీ, విద్యార్థులు ఉన్నారు.

## ఎంపీడీవోకు సన్మానం



**వింజమూరు, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త :** వింజమూరు మండలం ఏకిస్తీపురం పంచాయతీ పరిధిలోని చింతలపాలెం బీసీ కాలనీ వాసులు మంగళవారం ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి తాగునీటి సమస్య పరిష్కారంకు మార్గం చూపినందుకు శాలువా పూలమాలతో ఎంపీడీవోను సత్కరించారు. చింతలపాలెం బీసీ కాలనీలో గత మూడు నెలలుగా తాగునీటి సమస్యతో సతమతమవుతూ సోమవారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కే.శ్రీనివాసరెడ్డి కాలనీ వాసులతో ఒకటి రెండు రోజులలో బోరు వేయిస్తానని హామీ ఇవ్వడంతో కాలనీ వాసులు ఆందోళన విరమించారు. ఈ నేపథ్యంలో సోమవారం సాయంత్రమే బోరు వేయించడంతో నీరు పుష్కలంగా ఉండడంతో కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేస్తూ మంగళవారం ఎంపీడీఓ కార్యాలయాన్ని చేరుకుని ఎంపీడీవోని శాలువా పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ ప్రస్తుతం వేయించిన ఈ బోరుకు మోటార్ బిగించి తమ కాలనీ వాసులకు తాగేందుకు ఇతర అవసరాలకు ఉపయోగించుకునే విధంగా అధికారులు చూడాలని మరల ఈ బోర్ నీటిని ప్రధాన పైపులైనుకు కనెక్షన్ ఇచ్చినట్లయితే తాము తిరిగి ఇబ్బందులు పడే పరిస్థితులు ఏర్పడతాయని వారు తెలిపారు. అందుకు ఎంపీడీఓ స్పందించి మీపంచాయతీ సర్పంచ్ స్పందించడంతో సమస్య పరిష్కారం జరిగిందని ఆయన కాలనీ వాసులకు తెలిపారు. కాలనీ అవసరాల కొరకు మాత్రమే బోరు ఉపయోగిస్తామని తెలిపారు. దాంతో వారు ఆనందం వ్యక్తం చేశారు.

## ఆత్మకూరులో అంగన్‌వాడీలకు ఇంటర్వ్యూలు



**ఆత్మకూరు ,సెప్టెంబరు9,ప్రభాతవార్త :** ఆత్మకూరులోని ఆర్‌డిఓ కార్యాలయంలో మంగళవారం ఆత్మకూరు డివిజన్ స్థాయిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఆర్‌డిఓ భూమిరెడ్డి పావని ఆధ్వర్యంలో ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.హేనాసుజన్, కమిటీ సభ్యులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఆత్మకూరు, అనంతసాగరం, ఉదయగిరి, రాపూరు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ల పరిధిలోని ఆత్మకూరు,ఏఎస్‌పేట, సంగం,చేజర్ల, అనంతసాగరం, మర్రిపాడు, కలువాయి ,ఉదయగిరి, సీతారామపురం మండలాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకుల పోస్టుల ఖాళీలకు అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. వారందరికీ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఆర్‌డిఓ పావని, పిడి హేనాసుజన్, స్థానిక అర్బన్ పి.హెచ్.సి.వైద్యాధికారిణి డాక్టర్ షేక్ అస్మా, ఆత్మకూరు సిడిపిఓ పి.సునీలత, అనంతసాగరం సిడిపిఓ ఎం.పద్మావతి, రాపూరు సిడిపిఓ సునంద, ఉదయగిరి సిడిపిఓ పుణ్యవతిలు ఇంటర్వ్యూలు నిర్వహించారు. డివిజన్ స్థాయిలో దాదాపు 80మంది దరఖాస్తు చేసుకోగా64మంది హాజరయ్యారు. ఆత్మకూరు ప్రాజెక్ట్ పరిధిలో 4అంగన్‌వాడీ వర్కర్ పోస్టులకు గాను 11మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా 11మంది హాజరయ్యారు, 16హెల్పర్ పోస్టులకు గాను 30మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా 28మంది హాజరయ్యారని ఆత్మకూరు ప్రాజెక్ట్ అధికారిణి పి.సునీలత తెలిపారు. ఈకార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు జి.కస్తూరి, డి.శ్రీదేవి, రమాదేవి, పద్మ , ఎన్.కేశవనారాయణమ్మ, అభ్యర్థులు పాల్గొన్నారు.

## అనాథరైజ్ ప్లాట్లు కొన్నవారు రెగ్యులర్ చేయించుకోవాలి



**కావలి, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త:** కావలి మున్సిపాలిటీ పరిధిలో అనాథరైజ్ ప్లాట్లు కొనుగోలు చేసిన వారు తప్పనిసరిగా రెగ్యులరైజ్ చేసుకోవాలని కావలి మున్సిపల్ కమిషనర్ జి శ్రావణ్ కుమార్ తెలియజేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు రాష్ట్ర ప్రభుత్వం అనధికార లే అవుట్ లలో ప్లాట్లు 2020 ఎల్ఆర్ఎస్ స్కీం కింద జూన్ 30, 2025 వరకు ఫ్లాట్లు రిజిస్ట్రేషన్ చేయించుకున్న ఫ్లాట్ల యజమానులందరికీ ఎల్ఆర్ఎస్ స్కీం కింద ప్లాట్లను రెగ్యులరైజ్ చేసుకోవటానికి ప్రభుత్వం మంచి అవకాశం కల్పించిందని తెలియజేశారు. రాబోవు రోజుల్లో అక్కడ ఇల్లు కట్టుకోవాలి అనుకున్న ఇతరితర డెవలప్మెంట్ కార్యక్రమాలు చేసుకోవాలనుకున్న ప్లాట్లు తప్పనిసరిగా రెగ్యులరైజ్ అయి ఉండాలని తెలియజేశారు ఎల్ఆర్ఎస్ కింద అప్లై చేసుకునేవారు లైసెన్స్ ఇంజనీర్స్ వర్ధకాని, సచివాలయ వాటర్ ప్లానింగ్ , సెక్రటరీల వర్ధకాని, మున్సిపల్ కార్యాలయం వద్ద కానీ, టౌన్ ప్లానింగ్ హెల్ప్ డెస్క్ వద్ద కానీ పేరు నమోదు చేసుకొని తగినంత రుసుము చెల్లించి అప్లికేషన్ ఆన్లైన్ చేయించుకోవాలని కోరారు రాబోవు రోజుల్లో ఎప్పుడు ఇల్లు కట్టుకోవాల అనుకున్న సులభతరంగా అనుమతులు రావడం జరుగుతుందని తెలిపారు ఎవరైనా ఎల్ఆర్ఎస్ చేసుకొని ఫ్లాట్ల యజమానులకు పురపాలక సంఘం నుండి ఎలాంటి అనుమతులు రాబోవు రోజుల్లో ఇవ్వడం జరగదని తెలిపారు. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకొని ఎల్ఆర్ఎస్ 2020 స్కీం క్రింద ఎవరైనా అనాథరైజ్డ్ ప్లాట్లు కొని ఉంటే తప్పనిసరిగా అప్లై చేసుకోవాలని కోరారు.

## రాపూరు సిహెచ్‌సిలో డాక్టర్‌గా సరస్వతి సేవలు ఎనలేనివి

**రాపూరు,సెప్టంబరు9ప్రభాతవార్త :** రాపూరు ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో సివిల్ అసిస్టెంట్ సర్జన్‌గా డాక్టర్ సరస్వతి అందించిన సేవలు ఎనలేనివని నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రుల సమన్వయకర్త డాక్టర్ పరిమళ తెలిపారు. మంగళవారం రాపూరు సిహెచ్‌సిలో సి.ఎ.ఓగా విదులు నిర్వహిస్తూ పదోన్నతిపై రాజమండ్రికి వెలుతున్న డాక్టర్ సరస్వతికి సిబ్బంది అత్మీయ సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు వక్తలు మాట్లాడుతూ రాపూరులో వైద్యం అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్న సమయంలో ఇక్కడకు గూడూరు నుండి బదిలిపై వచ్చిన డాక్టర్ సరస్వతి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించి ఈ ప్రాంతంలోని ప్రజలకు ఎంతో దగ్గరైనదన్నారు. గతంలో సీజెరియన్ చేయించుకోవాలంటే వేలకు వేలు ఖర్చు పెట్టి ప్రవేటు ఆసుపత్రిలకు ఈ ప్రాంత ప్రజలు వెల్లేవారని, అయితే సరస్వతి భాధ్యతలు స్వీకరించిన తరువత ఈ ఆసుపత్రిలో ప్రతి నిత్యం కాన్పులు, చేసేవారని ఎక్కువ శాతం సాధరణ కాన్పులు జరిగేలా అమె వైద్య సేవలు అందించారన్నారు. దీంతో పాటు సీజెరియన్లు సైతం ఉచితంగా నిర్వహించి అనేక మందికి ఆర్థికంగా వెసులు బాటు కల్పించారన్నారు. అమే సేవ ధృక్పదంతో పనిచేయడంతో ఇతర సిబ్బంది సైతం ఆమెను ఆదర్శంగా తీసుకోని వారు సైతం ప్రజలకు మంచి సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం ఆమె బదిలిపై వెల్లడం భాదగా వున్నట్లు చెప్పారు. అనంతరం ఆమెను సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాపూరు సర్పంచ్ భూపతి జయమ్మ, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు డాక్టర్ గజరా వేణుగోపాల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్స్‌పాల్ డాక్టర్ హనుమంత రావు, టిడిపి పట్టణ ఆధ్యక్షుడు ఎదోటి కోటి, మండల కోఆప్షన్ సయ్యద్, భూపతి జయరామయ్య, పలువురు వైద్యులు, వైద్య సిబ్బంది వున్నారు.

## అధిక యూరియా వాడకంపై అవగాహన



**కలువాయి సెప్టెంబర్ 9 ప్రభాతవార్త :** వరిలో అధిక యూరియా వాడకం వల్ల కలిగే నష్టాలను,అనార్ధాలను, రైతులకు మండల వ్యవసాయాధికారి చల్లా కళారాణి వివరించారు. మండలంలోని కనుపూరుపల్లి ,చింతలాత్మకూరు గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ఏఓ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతు వరిలో అధిక యూరియా వాడకం వల్ల నేలలోని ఆమ్లత్వం పెరిగి నెలలోని పోషక లభ్యత తగ్గిపోతుందని అన్నారు. అధిక యూరియా వాడడం వల్ల పంట ఏపుగా పెరిగి ఎక్కువ గా చీడపీడలు ఆశించడం జరుగుతుందని దీని కారణంగా రైతులు ఎక్కువ పురుగు మందులు వాడడం కారణంగా సాగు బడి ఖర్చులు పెరిగి పోతాయన్నారు. సేంద్రియ పద్దతిలో సాగు చేయడం వలన నేలలోని సేంద్రియ కర్బనం పెరిగి నేల సారవంతమౌతుందని ఈ సందర్భంగా రైతులకు తెలియజేశారు.అనంతరం అధిక యూరియా వాడడం వల్ల కలిగే నష్టాలను ర్యాలీ ద్వారా తెలియజేశారు. ఈకార్యక్రమంలో ఏఇఓ రామకృష్ణా,విఏఏ కిరణ్ ,నరసింహ సిబ్బంది పాల్గొన్నారు.

### నాడు పంట కాలువల్లో పూడిక తీయని వైసీపీ.. ఇప్పుడు రైతుల సంక్షేమం గురించి మాట్లాడితే నమ్మాలా..?



**నెల్లూరు, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త** నాడు పంట కాలువల్లో పూడిక తీయని వైసీపీ ఇప్పుడు రైతుల సంక్షేమం గురించి మాట్లాడితే రైతులు నమ్మాలా అని ఏపీ వక్ఫ్‌బోర్డు చైర్మన్, నెల్లూరు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు అబ్దుల్ అజీజ్ అన్నారు. రాష్ట్రంలో ఎరువుల విషయంలో ప్రజలకు వాస్తవాలు తెలిసేలా అబ్దుల్ అజీజ్ పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ ఎరువుల సరఫరా విషయంలో సమస్యను గుర్తించిన ప్రభుత్వం తొలి రోజు నుంచే పరిష్కారం కోసం ప్రయత్నం చేస్తుందని అన్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌కు 6.91 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయించగా, ఇప్పటి వరకు 6.11 లక్షల మెట్రిక్ టన్నులు రైతులు వినియోగించుకు న్నారని అన్నారు. గత ఏడాదితో పోలిస్తే ఈ సారి అదనంగా 1.04 లక్షల మెట్రిక్ టన్నులు రైతులు కొనుగోలు చేశారని, డీఏపీ , ఇతర ఎరువుల వినియోగం కూడా 20 శాతం పెరిగిందని అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 80,503 మెట్రిక్ టన్నుల ఎరువుల నిల్వలు అందుబాటులో ఉన్నాయని, త్వరలోనే 30 వేల మెట్రిక్ టన్నుల యూరియా రాష్ట్రానికి వస్తుందన్నారు. కేంద్రం సహకారంతో కాకినాడ, విశాఖ, న్యూ మంగళూరు, రాయగఢ పోర్టుల నుండి కూరు ఎరువులు సరఫరా అవుతున్నాయని, రైతులకు 45 కేజీల యూరియా బస్తా కేవలం రూ.250 కే అందుతోందని, దీనిపై కేంద్రం రూ.1,900 సబ్సిడీ ఇస్తోందన్నారు. రైతుల పట్ల ప్రభుత్వం అంకితభావం, సుమర్ధ నీటి నిర్వహణతో అదనంగా 1.6 లక్షల ఎకరాల్లో సాగు జరిగిందని అన్నారు. రబీ సీజన్ కోసం 9.38 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా సిద్ధం చేస్తున్నారని అన్నారు. కాఫీ, మామిడి, పగాకు, మిర్చి, కోకో వంటి పంటల సమస్యలపై వెంటనే స్పందించి రైతులకు నష్టపరిహారం అందించాలని అన్నారు. పొగాకు రైతుల కోసం రూ.200 కోట్లు, మామిడి రైతుల కోసం రూ.260 కోట్లు, కోకో రైతుల కోసం రూ.20 కోట్లు విడుదల చేశారని అన్నారు. అన్నదాత సుఖీభవ పథకం కింద తొలి విడతలోనే రూ.3,200 కోట్లు రైతులకు అందించారు. రూ.13,500 కోట్లతో ధాన్యం కొనుగోలు చేసి, 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేశారు. ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తూ, అవసరమైన ఎరువులు సమయానికి అందిస్తోంది. కానీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మాత్రం వాస్తవాలను దాచి పెట్టి రైతులను మోసం చేస్తూ రాజకీయ లాభం కోసం అబద్ధపు ప్రచారాలు చేస్తోందన్నారు.

## సహకార బ్యాంకు చైర్మన్‌ను కలిసిన, చల్లా



**వింజమూరు, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త :** నెల్లూరులోని జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ కార్యాలయంలో మంగళవారం సొసైటీ సహకార బ్యాంకు చైర్మన్ మెటుకూరు ధనుంజయరెడ్డిని వింజమూరు సొసైటీ అధ్యక్షులు చల్లా వెంకటేశ్వర్లు యాదవ్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువా పూలమాలతో సన్మానించారు. వింజమూరు సొసైటీ అభివృద్ధికి రైతుల సంక్షేమం కోసం ఇబ్బందులు లేకుండా యూరియా సక్రమంగా అందే విధంగా చూడాలని ధనుంజయరెడ్డికి వినతిపత్రాన్ని అందజేయడం జరిగింది. ఆయన సానుకూలంగా స్పందించి యూరియా రైతులకి అవసరమైన మేర అందిస్తానని తెలిపినట్లు చల్లా తెలిపారు.

## 10న అండర్ 14 ఇయర్స్ అండ్ 17 ఇయర్స్ బాలబాలికల ఎస్‌జిఎఫ్ జిల్లా స్థాయి ఎంపికలు



**బుచ్చి సెప్టెంబర్ 9 ప్రభాతవార్త ;** ఎస్ఎఫ్ జిల్లా స్థాయి సార్వత్రిక సమావేశం బుచ్చి రెడ్డిపాళెం నగర పంచాయితీలోని స్థానిక రెయిన్‌బో స్కూల్‌లో నిర్వహించారు .కందుకూరు ఉప విద్యాశాఖాధికారి పివి నరసింహరావు ఆధ్వర్యంలో డివిజనల్ మరియు జిల్లాలలో గల వివిధ మండలాల కో ఆర్డినేటర్లు సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు.ఈ సమావేశం 10.9.2025 69 వ జిల్లా స్థాయి ఎస్‌జిఎఫ్ ఎంపికలకు సంబం దించినటువంటి విధి విధానాలను చర్చిం చడం మరియు దాని మీద అవగాహన కల్పించడం జరిగింది.ఈకార్యక్రమంలో నెల్లూరు జిల్లా ఎస్‌జిఎఫ్ కార్యదర్శలు అయిన భీమతాటి వెంకటరమణయ్య, ఎం.దేవిక, నెల్లూరు జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘ అధ్యక్ష కార్యదర్శులు నెల్లూరు జిల్లా బలంపిక్ సంఘ కార్యదర్శి మరియు మండల విద్యాశాఖ అధికారి -1 మర్రిపాడు మండలం వారు మరియు వివిధ మండలాల కోఆర్డినేటర్లు ఈ సమావేశంలో పాల్గొన్నారు. సెప్టెంబర్ 10 వతేదిన అండర్ 14 ఇయర్స్ అండ్ 17 ఇయర్స్ వయసు గల బాలబాలికలకు ఎస్‌జిఎఫ్ జిల్లా స్థాయి ఎంపికలు ఉదయం 10 గంటలకు జరుగుతాయని తెలిపారు. 14 మరియు 17 సంవత్సరాల బాలబాలికల ఆర్చరీ క్రీడాకారుల ఎంపికలు ఏసి సుబ్బారెడ్డి స్టేడియం నెల్లూరు నందు జరుగును. వివరాలకు అరగల విజయ్ కుమార్ ఎస్ఏ (పిఇ) జిల్లాపరిషత్ హైస్కూల్ దగదర్తి 9441875190, 14 మరియు 17 సంవత్సరాల బాల బాలికల స్పీపిక్ త్రో జిల్లా స్థాయి క్రీడాకారుల ఎంపికలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కోత్తూరు ఆప్ ఇందుకూ రుపేట నందు జరుగును. వివరాలకు ఎ సుకుమార్ ఎస్ఎ (పిఇ) 8125111811ని సంప్రది ంచాలని సూచి ంచారు.

## ఘనంగా కాళోజి నారాయణరావుల జయంతి వేడుకలు

**- హాజరైన ఎమ్మెల్యే సోమిరెడ్డి**



**వెంకటాచలం,సెప్టెంబర్ 9,ప్రభాతవార్త:** గిడుగు వెంకటరామ్మూర్తి కాళోజి నారాయణ రావు జయంతి ఉత్సవాలు తెలుగు భాషా పరిమాణంలో ఒక మైలురాయని సర్వేపల్లి శాసన సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పేర్కొన్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పాల్గొన్నారు.అనంతరం ఆయన మాట్లాడుతూ తెలుగు భాషా ప్రాముఖ్యత నేటి సమాజానికి ఈ ప్రాంతీయ కేంద్రం ఎంతో ఉపయోగపడుతుందన్నారు.ప్రాచీన భాషలో అభివృద్ధికి తీసుకోవాల్సిన నిర్ణాయాలను వివరించారు. మైసూరులో ఉన్న ఈ ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రాన్ని పెద్దలు వెంకయ్య గారి చరువతో సర్వేపల్లి నియోజకవర్గానికి రావడం మన అందరి అదృష్టం అన్నారు.రాష్ట్ర జిల్లాలో ఉన్న ప్రతి ఒక్కరూ తెలుగు ప్రాచీన అధ్యయన కేంద్రం తెలుగు సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో విక్రమ సింహపూరి విసి అల్లం శ్రీనివాసా రావ్ ఆచార్య వి ఎస్ సుందరం,వేదంత రాజగోపాల్,గరికపాటి ఉమా మహేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## కందుకూరులో వైయస్సార్ సిపి అన్నదాత పోరు




**కందుకూరు,సెప్టెంబర్ 9,ప్రభాతవార్త:** రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న రైతాంగ సమస్యలు, యూరియా కొరత లేకుండా రైతులకు అందించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం పట్టణంలో రాష్ట్రవ్యాప్త అన్నదాత పోరు మాజీ ఎమ్మెల్యే వైసీపీ ఇన్చార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ జరిగింది. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమా లలు వేసి నివాళులర్పించి రైతు ర్యాలీ సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు నిర్వహించారు. సబ్ కలెక్టర్ హిమవంశీ కి రైతు సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. అనంతరం బుర్రా మధుసూదన్ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అన్నదాతలు ఎరువులు అందక, సబ్సిడీ రుణాల మంజూరుకాక,రైతు భరోసా అరకొరగా ఇస్తున్న కూటమి ప్రభుత్వ చర్యల వల్ల అల్లాడిపోతున్నారని, యూరియా కోసం పడిగాపులు కాస్తున్న రైతాంగానికి వెంటనే సరిపడా ఏరియా అందించాలని కోరారు. ప్రభుత్వం ఇప్పుడు అయినా మొద్దు నిద్ర వదిలి రైతుల సమస్యల పట్ల స్పందించాలని స్థానిక శాసనసభ్యులు దోచుకో, దాచుకోలా కాకుండా ఓట్లు వేసిన ప్రజల సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.మీ పచ్చ మీడియా లోనే రకరకాలుగా అవినీతి ఆరోపణలు వెలువెత్తుతున్నాయని ఎప్పటికైనా కళ్ళు తెరిచి రైతుల సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తోకల కొండయ్య, గణేశం గంగిరెడ్డి, ముప్పవరపు కిషోర్, షేక్ రఫీ, ఈదర రమేష్, నోటి వెంకటేశ్వర రెడ్డి, అనుమోల లక్ష్మీ నరసింహ, నన్నం పోతురాజు, కాపులూరి కృష్ణ, రావులకొల్లు బ్రహ్మానందం, వెలిచెర్ల ధన కోటి, పాశం కొండయ్య, చీమల వెంకటరాజా, పెయ్యల వెంకట రమణయ్య, మర్లపాటి ఆదాము, ఉచ్చులూరి రవీంద్ర, కాపులూరి మధు, దొడ్డంరెడ్డి మదన్మోహన్ రెడ్డి, చిట్యాల సురేష, ఎర్రమల నాగభూషణం, బద్దిపూడి జయరావు, చనమాల కోటేశ్వరరావు, షేక్ రహీం, సీతారామిరెడ్డి, దేవరకొండ ఆదిలక్ష్మి, తుళ్లూరు ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## సీతమ్మ అమ్మవారి మంగళ సూత్రం చోరి



**చేజర్ల సెప్టెంబర్ 9 ప్రభాతవార్త :** చేజర్ల మండలం కొలపనాయుడు పల్లి గ్రామంలోని రామాలయంలో సీతమ్మ అమ్మవారి మంగళ సూత్రాన్ని చోరి చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామస్తుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలోని రామాలయంలో నిత్యం భక్తులు భజనలు నిర్వహించడం ఆనవాయితీ, అందులో భాగంగా గత రెండు రోజులు క్రితం భక్తులు భజన పూజ చేసుకోని భక్తులు ఎవరి ఇండ్లికి వారు వెళ్లిపోయారు. సహజంగా ఆలయానికి తాళం వేసినప్పటికి ఆ తాళాలను గుడిలోని ఒక ప్రాంతంలో భక్తుల కోసం ఉంచడం గత కొంత కాలంగా కొనసాగుతుంది. ఇది గమనించిన గుర్తు తెలియని వ్యక్తులు రాత్రి వేళల్లో ఆలయం తలుపులు తెరచి సీతమ్మ అమ్మవారి మెడలో ఉన్న మంగళ సూత్రాన్ని చోరి చేసినట్లు గ్రామస్తులు గుర్తించారు. అంతకు ముందు కూడా గ్రామంలోని దేశమ్మ అమ్మవారి ఆలయంలో తలుపులు పగల గొట్టి అక్కడ ఉన్నటువంటి హుండిని చోరి చేసి అందులో ఉన్న నగదును మాయం చేసిన సంఘటన జరిగి ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు.ఈ సంఘటనకు సంబంధించి పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిసింది.

## ఘనంగా నేత్రదాన పక్షోత్సవాల ముగింపు కార్యక్రమం



**నెల్లూరు, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త – వైద్యం :** నేత్రదానంపై మరింత అంగాహన పెంచి, అంధులకు చూపునిచ్చే బృహత్తర కార్యక్రమాన్ని మరింత పటిష్టంగా అమలు చేయాలని డీఎంహెచ్ఓ వి.సుజాత పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నేత్రదాన పక్షోత్సవాల్లో విశేష ప్రతిభ కనపరిచి, ప్రజలను, విద్యార్థులను చైతన్యవంతం చేసిన కమ్యూనిటీ పారా మెడికల్ సిబ్బందిని, పీఎంపీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా నేతలను ఇతర స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను, అధికారులు సత్కరించి, మెమోంటోలు అందించారు. సోమవారం, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగిన నేత్రదాన పక్షోత్సవాలు ముగింపు కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ వి.సుజాత, అసిస్టెంట్ డీఎంహెచ్ఓ డాక్టర్ షేక్ ఖాదర్ వల్లి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ ఎం.శార్వాణి చేతుల మీదుగా పీఎంపీ జిల్లా అధ్యక్షులు శాఖవరపు వేణుగోపాల్‌కు పారా మెడికల్ సిబ్బందికి, ఇతర స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు శాలువాలు కప్పి, మెమోంటోలు అందజేశారు. ఇంకా పలువురు పీఎంపీ అసోసియేషన్ నేతలను శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ నేత్రదాన పక్షోత్సవాలలో పీహెచ్‌పీల కృషి మరువలేనిదని అన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రచార కార్యక్రమాలు చేపట్టి ప్రజల్లో విద్యార్థుల్లో నేత్రదానంపై అవగాహన కల్పించారని అన్నారు. మెమోంటో అందుకున్న శాఖవరపు వేణుగోపాల్ మాట్లాడుతూ మనిషి మరణానంతరం(కార్నియా) నేత్రదానం విద్యార్థి దశ నుంచే అవగామన కలిగి ఉన్నట్లయితే నేత్రదాన కార్యక్రమం విజయవంతమవుతుందని, చూపుని కోల్పోయిన అంధులకు సరైన సమయంలో నేత్రాలను అమర్చి వారి కళ్ళల్లో వెలుగును నింపిన వారమవుతారని, మా అసోసియేషన్ జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో డివిజన్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని, దానికి గుర్తుగా ఈ రోజు శాలువా మెమొంటో తో సన్మానించడం జరిగిందని, నేత్రదానంపై మరిన్ని కార్యక్రమాలు నిర్వహించి ప్రజలను చైతన్యపరచుటలో భాగస్వామ్యం అవుతామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పీఎంపీ ప్రధాన కార్యదర్శి గోరంట్ల శేషయ్య, కోశాధికారి దేవరకొండ శ్రీనివాసులు, నాయకులు నరసాపురం ప్రసాద్, ఉప్పలపాటి రామదాసు తదితరులు పాల్గొన్నారు.

## విధి నిర్వహణలో పీహెచ్‌సీల సిబ్బంది అలసత్వం సహించను



**నెల్లూరు, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త –వైద్యం :** పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వైద్య ఆరోగ్య సిబ్బంది, క్షేత్ర స్థాయిలో తీసిన రక్త పూతలను తప్పనిసరిగా ప్రతి బుధవారం, ప్రతి శనివారం ల్యాబ్‌లకు చేర్చాలని, అలా చేర్చని సిబ్బందిపై చర్యలు తప్పవని, జిల్లా మలేరియా నివారణాధికారి ఇ.హుస్సే నమ్మ హెచ్చరించారు. మంగళవారం ఆమె వేదాయపాలెం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రక్త పూతలను తప్పనిసరిగా సకాలంలో ల్యాబ్‌లకు చేర్చాలని సిబ్బందికి సూచించారు. సెక్టార్ మీటింగ్ తర్వాత 15 రోజులు 20 రోజులకు కూడా స్లైయిడ్‌లు ఇవ్వని వారిని గుర్తించి, వైద్యాధికారికి తెలియజేయాలని ఆదేశించారు. మరలా అలాంటి పొరపాట్లు జరగకుండా చూడాలని సూచించారు. లార్వా సర్వే, ఫీవర్ సర్వే పరిశీలించి తగిన సూచనలు ఇచ్చారు. పాసివ్ రిజిస్టర్, ఓపీ రిజిస్టర్ పరిశీలించారు. అనంతరం సమీపంలోని బాలికల హాస్టల్‌ను సందర్శించి అక్కడి పరిసరాల పరిశుభ్రపై విద్యార్థులకు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఢిల్లీలో కాళ్ల బేరం.. ఏపీలో వీధి నాటకాలు- సోమిరెడ్డి



**నెల్లూరు, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త –వైద్యం :** ఎరువుల కొరత పేరుతో వైసీపీ డ్రామాలపై టీడీపీ సీనియర్ నాయకులు, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించి మాట్లాడారు. వైసీపీ ఢిల్లీలో కాళ్ల బేరం చేస్తూ ఏపీలో వీధి నాటకాలాడుతోంది. దేశ వ్యాప్తంగా యూరియా కొరత సమస్యగా మారింది. ఎరువుల సరఫరా పూర్తిగా కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉంటుంది. సీఎం చంద్రబాబునాయుడు ఎప్పటికప్పుడు పర్యవేక్షించడంతో పాటు కేంద్ర మంత్రితో మాట్లాడి 50 వేల టన్నులు ఏపీకి కేటాయించేలా సక్సెస్ అయ్యారు. రైతులకు సమస్యలు ఎదురుకాకుండా కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతూ ముందుకు సాగుతోంది. ఉపరాష్ట్రపతి ఎన్నికకు సంబంధించి మీకే మా మద్దతు అని ఢిల్లీలో కాళ్లు పట్టుకున్నారు. ఇక్కడేమో నిరసనల పేరుతో డ్రామాలేసుకుంటున్నారు. వైసీపీ ప్రభుత్వంలో వ్యవసాయ శాఖను పూర్తిగా మూసేశారు. ఎరువులు, పురుగు మందుల నుంచి సూక్ష్మపోషకాలు, బిందు తుంపర్ల సేద్యం, యాంత్రీకరణ వరకు అన్నింటిని మూలనపెట్టేసినోళ్లు ఈ రోజు మాట్లాడుతున్నారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేస్తే రైతులకు ఆర్నెళ్లకు కూడా నగదు చెల్లింపులు లేవు. తరుగు, నెమ్ముల పేరుతో రైతుల నుంచి అదనంగా ధాన్యం వసూళ్లు చేశారు. నెల్లూరు జిల్లాలో 850 కిలోల ధాన్యాన్ని పుట్టిగా పిలుస్తారు. వైసీపీ పాలనలో ఆ పుట్టికి అర్థం మార్చేసి 1000, 1100 కిలోల ధాన్యాన్ని రైతుల వద్ద గుంజుకున్నారు. వైసీపీ నాయకులు ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నాల పేరుతో డ్రామాలు చేసి ఎరువుల గురించి మాట్లాడటం విచిత్రంగా ఉంది. ఢిల్లీలో కాళ్లు పట్టుకుంటూ ఏపీలో డ్రామాలేస్తున్న వైసీపీ తీరును చూసి ప్రజలు నవ్వుకుంటున్నారు. ఇప్పటికైనా డ్రామాలు ఆపాలని హితవు పలుకుతున్నాం అన్నారు.

## పగతి ఎడ్యుకేషనల్ సొసైటి ఆధ్వర్యంలో స్టడిమెటీరియల్ పంపిణి



**జలదంకి. సెప్టంబర్ 9, ప్రభాతవార్త:** జలదంకి మండలం బ్రాహ్మణక్రాక పంచాయతి పరిధిలోని అగ్రహారం గిరిజన కాలని ప్రాదమికపాఠశాల విద్యార్దిని ,విద్యార్థులకు మంగళవారం ప్రగతిఎడ్యుకేషనల్ సొసైటి వారు స్టడిమెటీరియల్,బోజనపేట్లు అందజే శారు.సొసైటి వ్యవస్థాపక అద్యక్షుడు పిడుగు రమణయ్య తన తండ్రి పిడుగు తిరుపాలయ్య 6వ వర్దంతి సందర్బంగా ఈకార్యక్రమం చేపట్టారు.ఈ సందర్బంగా మండలా ధ్యక్షుడు గోచిపాతల రమణయ్య తనచేతులమీదుగ అందజేసి పిల్లల్ని దీవించారు.ఉపాధ్యాయులు బోదించే విద్యపై ఏకాగ్రత కనపరస్తు క్రమశిక్షణతో చదుకుకొని పైగెదగాలనిసూచించారు.ఈపాఠశాలలో గిరిజన పిల్లలు విద్యనభ్యసిస్తున్నారు కావున ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్దపెట్టి వారిని తీర్చిదిద్దాలని అన్నారు. ప్రగతి ఎడ్యుకేషనల్ సొసైటి అద్యక్షుడు రమణయ్య తన తండ్రి వర్దంతిని పురష్కరించుకొని ప్రతి ఏడాది ఇలాంటి మంచి కార్యక్రమాలు చేపట్టడం ఎంతో సంతోషించదగ్గ విషయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి మాజి మండలాధ్యక్షుడు చిత్తాబత్తిన మస్తాన్‌రెడ్డి,మాజి ఎంపిటిసి చెంచయ్య,సొసైటి అద్యక్షుడు రమణయ్య,టీచర్లు శైలజ,జనార్దన్,వేణు,పిల్లల తల్లి,దండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం చేసిన బొట్లగుంట



**కావలి,సెప్టెంబర్9, ప్రభాతవార్త:** కావలి మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డు ఎస్సీ కాలనీ నివాసులు పోతిపోగు వెంకటేశ్వర్లు ఇటీవల మృతి చెందడం జరిగింది ఆయన ఉత్తరక్రియల కార్యక్రమానికి సీనియర్ టిడిపి నాయకులు, నెల్లూరు పాం ర్లమెంట్ తెలుగు రైతు ఉపాధ్యక్షులు బొట్లగుంట శ్రీహరి నాయుడు పాల్గొని వెంకటేశ్వర్లు చిత్రపటానికి పూల మాలను వేసి నివాళులర్పించి తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసి 5వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో పూర్తిపోగు బుల్లోడు, బోయిన మాధవ మరియు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు .

## క్వారీ పోరంబోకు భూములను పరిశీలన చేసి పరిష్కారం తహసిల్దార్



**కొడవలూరు సెప్టెంబర్ 9 ప్రభాతవార్త :** మండలంలోని రేగడిచెలక వద్ద క్వారీ పోరంబోకు భూమి కొన్నాళ్ల క్రితం రెండు కొంతమందికి పట్టాలు ఇవ్వడం జరిగిందని రెండు వర్గాలకు చెందిన వారు తహసిల్దార్ కార్యాలయం చేరుకుని సమస్యను తెలియజేసినట్లు తహసిల్దార్ కె. స్ఫూర్తి రెడ్డి పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజనులకు, బీసీలకు ఆ భూమికి సంబంధించి పట్టాలు ఉన్నాయని తెలుపుతున్నారు. దీనిపై ఆర్ ఐ, వీఆర్వో పరిశీలన చేయడం జరుగుతుంది. పూర్తి నివేదిక స్వీకరించి జిల్లా అధికారులకు తెలిపి తదుపరి వారి ఆదేశాల మేరకు ఎవరి వద్ద అర్హులైన పట్టాలు ఉంటాయో మండల సర్వేయర్, గ్రామ సర్వేయర్ వారి చేత కొలతలు వేయించి పరిష్కరిస్తామన్నారు.

## బీసీడబ్ల్యూయు సదస్సును జయప్రదం చేయాలి




**సైదాపురం, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త :** సర్క్యులర్ 12,14ను రద్దు చేసి భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 26వ తేదీన గూడూరులో జరిగే బీసీడబ్ల్యూయు జిల్లా సదస్సును విజయవంతం చేయాలని బీసీడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్య దర్శి ఎం.అనిల్, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసి జిల్లా కార్యదర్శి డీపీ పోలయ్య తెలిపారు. సైదాపురంలోని ఐఎఫ్‌టీయు జిల్లా కార్యాలయంలో మంగళవారం కరపత్రాలు ఆవిష్కరించారు.ఈ సందర్భంగా రాష్ట్ర అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న భవన నిర్మాణ కార్మికులు రాష్ట్రంలో 35లక్షల కుటుంబాల వారు సుమారు 40 రకాల వృత్తులలో పని చేస్తూ భవన నిర్మాణ రంగాన్ని నమ్ముకుని జీవిస్తున్నారని, గడిచిన ఆరు సంవత్సరాలుగా ఉపాధి కోల్పోయి కార్మికులు దుర్భర జీవితాన్ని గడుపుతున్నారని తెలిపారు. సర్క్యులర్ 12,14ను రద్దు చేసి సంక్షేమ బోర్డును యధావిధిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

## నిరుపేదలకు అండగా ముఖ్యమంత్రి సహాయనిధి



**నెల్లూరు రూరల్, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త :** నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో 2.20 లక్షల రూపాయల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను నగర మాజీ మేయర్ నంది మండలం భాను శ్రీ పంపిణీ చేశారు. ప్రభుత్వం ద్వారా సహాయం అందుకున్న లబ్ధిదారులు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయం ఇంచార్జీ దాట్ల చక్రవర్ధన్ రెడ్డి, క్లస్టర్ ఇంచార్జులు మన్నేపల్లి రఘు, షంషుద్దీన్, నూకరాజు మదన్ కుమార్ రెడ్డి, కో క్లస్టర్ ఇంచార్జులు విష్ణు ప్రియ, పల్నాటి మస్తాన్ నాయుడు, నెల్లూరు రూరల్ నియోజకవర్గ టీడీపీ ఎస్.సి. సెల్ అధ్యక్షులు అరవ శ్రీనివాసులు, 32వ డివిజన్ కార్పొరేటర్ తాళ్లూరు అవినాష్, 22వ డివిజన్ కార్పొరేటర్ మూలే విజయ భాస్కర్ రెడ్డి, 41వ డివిజన్ టిడిపి అధ్యక్షుడు ఉచ్చూరు సురేష్, టిడిపి నాయకులు జిలాని, మేఘనాథ్ సింగ్, అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

## విఎస్‌యు 2వ సెమిస్టర్ పరీక్షా ఫలితాలలో ఎస్‌పిబివిడి డిగ్రీ కాలేజి విద్యార్థులు విజయభేరి



**పొదలకూరు, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త :** విక్రమ సింహపురి యూనివర్సిటి విడుదల చేసిన డిగ్రీ మొదటి సంవత్సరం 2వ సెమిస్టర్ పరీక్షా ఫలితాలలో పొదలకూరు పట్టణం బాలాజీ నగర్ లోని సాయి విద్యానికేతన్ ఆధ్వర్యంలో నడపబడుతున్న ఎస్‌పి బివిడి డిగ్రీ కాలేజి విద్యార్థిని ఎ.వాసంతి లక్ష్మి బికాం(సిఏ) గ్రూప్ నందు 9.41 గ్రేడ్ పాయింట్లతో పొదలకూరు మండల ప్రథమ స్థానాన్ని ఎన్. కామేశ్వరి బికాం (సిఏ)నందు 9.4 పాయింట్లతో ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. కే. చందన, (సిఏ) నందు 9.01 పాయింట్లు సాధించారు. ఈ సందర్భంగా ఎస్‌వీఎన్ విద్యాసంస్థల ఛైర్మన్ బి. వెంకటేశ్వర్లు, మేనేజింగ్ డైరెక్టర్ టి. నరేంద్ర రెడ్డి, మాట్లాడుతూ ఇంతటి ఘన విజయాన్ని సాధించిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు. అదే విధంగా భవిష్యత్తులో మరెన్నో విజయాలు సాధించి కాలేజికి మంచి పేరు తెచ్చే విధంగా విద్యార్థులు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాలేజి ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## బిట్రగుంటకు పూర్వ వైభవం తథ్యం




**బిట్రగుంట సెప్టెంబర్ 9 ప్రభాతవార్త:** కరోనా కష్టకాలంలో బిట్రగుంటలో నిలిపివేసిన అండమాన్ ఎక్స్ ప్రెస్, లక్నో ఎక్స్ ప్రెస్, తిరుపతి కాకినాడ ఎక్స్ ప్రెస్ ముఖ్యమైన రైళ్లను ఈ నెల 10వ తారీఖు నుండి బిట్రగుంటలో అధికారికంగా హాల్టింగ్ కల్పించిన రైల్వే ఉన్నతాధి కారులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ బిట్రగుంటలోని బోగోలు బజార్ సెంటర్లో బిట్రగుంట రైల్వే అభివృద్ధి కమిటీ సభ్యులు మధ్య ఆనందోత్సహాల మధ్య ఒకరికొకరు స్వీట్లు పంచుకుంటూ విజయోత్స వ ర్యాలీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బిట్రగుంట రైల్వే అభివృద్ధి కమిటీ అధ్యక్షులు షేక్ నూరుద్దీన్ మాట్లాడుతూ రైల్వే స్టేషన్లో కరోనా ముందు ఆగే రైళ్లను రైల్వే శాఖ హాల్టింగ్ ఎత్తివేసిన విషయం అందరికీ తెలిసినదే అప్పటినుండి ఇప్పటివరకు నిర్విరామంగా గల్లీ నుండి ఢిల్లీ స్థాయి వరకు చిన్న స్థాయి నుండి ఉన్నత స్థాయి అధికారుల వరకు బిట్రగుంట రైల్వే అభివృద్ధి కమిటీ వినతి పత్రాలు సమర్పిస్తూ అలుపెరుగని పోరాటాన్ని చేసిందన్నారు దాని ఫలితమే ఈరోజు బిట్రగుంట రైల్వే స్టేషన్లో ఆరు రైళ్లకు స్టాపింగ్ కల్పిస్తూ రైల్వే శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. చెన్నై కాట్రా వెళ్లే అండమాన్ ఎక్స్ ప్రెస్ మరియు చెన్నై లక్నో వరకు వెళ్లే ఎక్స్ ప్రెస్ అలాగే తిరుపతి కాకినాడ ఎక్స్ ప్రెస్ రైలు ఎగువ దిగువ మార్గాల్లో స్టాపింగ్ కల్పిస్తూ రైల్వే ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. రిజర్వేషన్ కౌంటర్ ను ఎత్తివేసిన సమయంలో కూడా బిట్రగుంట రైల్వే అభ్యర్ధి కమిటీ తీవ్రంగా కృషి చేసి మళ్లీ రిజర్వేషన్ కౌంటర్లు సాధించుకున్న విషయాన్ని గుర్తు చేశారు అలాగే నాటి ఉపరాష్ట్రపతి శ్రీ వెంకయ్య నాయుడు ఏర్పాటుచేసిన నెల్లూరు చెన్నై ఫాస్ట్ ప్యాసింజర్ ను బిట్రగుంట రైల్వే అభివృద్ధి కమిటీ ప్రతిష్టాత్మకంగా తీసుకొని ఆ రైలునూ ని బిట్రగుంట నుండి నడిచే విధంగా చర్యలు తీసుకుందన్నారు. ఈ కార్యక్రమంలో రైల్వే అభివృద్ధి కమిటీ సభ్యులు షేక్ జహీర్ బత్తుల రవిచంద్ర, దాసరి సునీల్, ఇమ్మిడి శెట్టి కోటేశ్వరరావు, ఇమ్మిడిశెట్టి శ్రీనివాసులు షేక్ నవీద్, మునుస్వామి వేణు, రాజారత్నం, నౌషాద్ తదితరులు పాల్గొన్నారు.

## అనంతపురం కు బస్సులు తరలించడంతో బస్సులు లేక అవస్థలు పడ్డ విద్యార్థులు



**కావలి, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త:** కావలి డిపో బస్సులు అనంతపురం సూపర్ సిక్స్ బహిరంగ సభకు బస్సులను తరలించడంతో కావలి నుండి ఓటూరు మోడల్ స్కూల్ కి వెళ్లే విద్యార్థులు,ఉపాధ్యాయులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురి కావడం జరిగిందనీ విద్యార్థుల తల్లిదండ్రులు ఖాదర్ బాషా, కరవది భాస్కర్ , ప్రవీణ్, వెంకటేశ్వర్లు తదితర విద్యార్థుల తల్లిదండ్రులు మంగళవారం ప్రభుత్వంపై ఆర్టీసీ అధికారులపై తీవ్ర నిరసన తెలియజేశారు . ఈ సందర్భంగా వారు మాట్లాడారు విద్యార్థులు ఆటోల్లో వెళ్లడానికి డబ్బులు లేక ఎక్కువ మంది విద్యార్థులు ఇంటికి తిరిగి వెళ్లడం జరిగిందన్నారు. కావలి నుండి ఓట్టూరు మోడల్ స్కూల్ కు సుమారు 200 పైగా విద్యార్థులు పాఠిక మందికి పైగా ఉపాధ్యాయులు నిత్యం ప్రయాణం చేస్తుంటారన్నారు. బస్సులు లేకపోవడంతో కొంతమంది ఆటోలకు కొద్దిమంది మోటర్ బైక్ ల మీద స్కూలుకు వెళ్లారు. సుమారు మూడు రోజులపాటు బస్సులు రావని తమ పిల్లలు స్కూల్ కి వెళ్లడానికి ఆటోలకు డబ్బులు భరించలేమని ఆవేదన వ్యక్తం చేశారు. బస్సు పాసులు తీసుకొని కూడా స్కూలుకు వెళ్లడానికి ఆటోలకు ఎందుకు డబ్బులు చెల్లించాలని ప్రశ్నించారు. కనీసం స్కూల్ ఉండే రూట్ ల బస్సులను అయినా అనంతపురం తరలించకుండా ఉండాల్సిందని అన్నారు. కనీసం ముందస్తు సమాచారం కూడా లేకుండా ఆర్టీసీ అధికారులు బస్సులను ఆపివేస్తే తమ విద్యార్థులు ఎలా స్కూల్ కి వెళ్ళాలని ప్రశ్నించారు.ప్రభుత్వం, ఆర్టీసీ అధికారులు విద్యార్థుల పట్ల ప్రదర్శిస్తున్న నిర్లక్ష్య వైఖరిని తప్పుపట్టారు. బస్సు లేకపోవడం వలన ఆటోలో వెళ్లాలంటే అంత సురక్షితం కాదని పైగా విద్యార్థినిలు తీవ్ర ఇబ్బందులు పడతారని అన్నారు.విద్యాసంస్థలు ఉండే రూట్లలో బస్సులు రద్దు చేయడం బాధ్య తరాహిత్యం అని అన్నారు. విద్యార్థుల పట్ల కనీస బాధ్యత లేకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారని అన్నారు .రేపటి నుండైనా ప్రత్యామ్నాయ ఏర్పాట్లను చేయాలని అన్నారు.అలాగే కావలి నుండి రుద్రకోట పాలిటెక్నిక్ కాలేజీ, కావలి నుండి వీరేపల్లి మోడల్ స్కూల్ కెళ్ళి విద్యార్థులు కూడా తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అలాగే కావలికి రూరల్ ప్రాంతాల నుంచి కాలేజీలకి వచ్చే విద్యార్థులు కూడా ఇబ్బందులు పడ్డారు. ఇకనైనా ఇటు వంటి సభలకు బస్సులను తరలించే సమయంలో విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వము ఆర్టీసీ అధికారులు వ్యవహరించాలని తల్లిదండ్రులు కోరారు.

## చందనాలంకారంలో స్వామివారు

**కోవూరు, సెప్టెంబరు9 ప్రభాతవార్త :** కోవూరులో వెలసి ఉన్న శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో మంగళవారం ప్రాత:కాలమునే స్వామివారికి ఆలయ ప్రధాన అర్యకులు నాగరాజాచార్యుల ఆధ్వర్యంలో అభిషేక పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి నాగవల్లి పత్రాలతో ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారు చందనాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం స్వామివారికి పల్లకి సేవ కార్యక్రమాలను కన్నులపండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రుత్వికులు సుబ్బయ్య స్వామి, నందకిషోర్ స్వామి, ఫణీంద్ర స్వామి, భక్తులు ఉన్నారు.

## యూరియా వాడకంలో మెళుకువలు పాటించాలి




**చెర్లోపాలెం( కోవూరు,) సెప్టెంబరు9 ప్రభాతవార్త :** కోవూరు మండలంలోని చెర్లోపాలెం గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులకు అధిక యూరియా వాడకం వలన ఏ విధమైన ఇబ్బందులు వస్తాయో రైతులకు అవగాహన కల్పించే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సహాయ వ్యవసాయ సంచాలకులు అనిత మాట్లాడుతూ పీఎండీఎస్ కిట్స్ భూమిలో వేయడం వలన పోషకాలు పెరుగతాయన్నారు. దీని వలన నేలలో సేంద్రియ కార్బన్ శాతం పెరుగుతుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని రైతులు వ్యవసాయ శాఖ సిఫార్సు చేసిన మోతాదులోనే ఎరువులు వాడుకోవాలన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయధికారిణి రజని, గ్రామ వ్యవసాయ సహాయకులు మెహర్నిసా , రైతులు ఉన్నారు.

## జిల్లా వైసీపీ ఇంటలెక్చువల్ ఫోరమ్ కార్యదర్శిగా గోపిరెడ్డి



**కోవూరు, సెప్టెంబరు9 ప్రభాతవార్త :** వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా పార్టీ అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి సూచనలతో మాజీ మంత్రి ప్రసన్నకుమార్‌రెడ్డి సహకారంతో నెల్లూరు జిల్లా వైసీపీ ఇంటలెక్చువల్ ఫోరమ్ కార్యదర్శిగా కోవూరు మండలం పడుగుపాడు గ్రామానికి చెందిన జలజీవన్ మిషన్ మాజీ చైర్మన్, వైసీపీ సీనియర్ నాయకుడు గోపిరెడ్డి భాస్కర్‌రెడ్డిని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఈ పదవి వచ్చేందుకు సహకరించిన మాజీ మంత్రి ప్రసన్నకుమార్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటానన్నారు.

## డిప్యూటీ డీఈవోకు పితృవియోగం



**కోవూరు, సెప్టెంబరు9 ప్రభాతవార్త :** నెల్లూరు జిల్లా ఉప విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు నాయక్ తండ్రి సభావత్ అంబానాయక్(88) మంగళవారం ఉదయం అకస్మాత్తుగా మృతిచెందారు.ఈ మేరకు ఆయన మృతదేహానికి ఎస్ఎస్ఏ పీవో వెంకటసుబ్బయ్య, ఏఎంవో సుధీర్‌బాబు, ఇందుకూరుపేట మండలానికి సంబంధించిన ఉపాధ్యాయులు, డిప్యూటీ డీఈవో కార్యాలయ అధికార ఉద్యోగులు, కోవూరులోని బ్రాహ్మణవీధిలో ఉన్న నాయక్ ఇంటికి వచ్చి వారి తండ్రి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు డిప్యూటీ డీఈవోను ఓదార్చి తమ సానుభూతిని తెలియజేశారు.

## పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలి



**కోవూరు, సెప్టెంబరు9 ప్రభాతవార్త :** బాలింతలు , గర్భవతులు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రమీల తెలిపారు. కోవూరు మండలం ఇనమడుగు సెక్టార్ పరిధిలో మంగళవారం పౌష్టికాహారం మాసోత్స వాల సందర్భంగా గర్భవతులకు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగాఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే పౌష్టికాహారంతో పాటు గ్రామాల్లో లభించే ఆకుకూరలు, గుడ్లు, పాలు కూడా సమపాళ్లలో తీసుకోవాలన్నారు. ఐరన్ శాతం ఎక్కువగా ఉండే పదార్థాలు తీసుకోవడం వలన వారిలో వ్యాధి నిరోధక శక్తి ఘననీయంగా పెరుగుతుందన్నారు. ఈ సందర్భంగా తక్కువ ఖర్చుతో తయారు చేసే పౌష్టికాహారాన్ని వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు శ్రీలక్ష్మి, కామాక్షి, ఆయాలు, గర్భవతులు, బాలింతలు ఉన్నారు.

## 10 సవర్లు బంగారం 20వేలు నగదు దొంగతనం



**విడవలూరు, సెప్టెంబర్ 9 ప్రభాతవార్త :** మండలం లోని వావిళ్ల గ్రామంలో నిద్రపోతున్న సోమవారం సమయంలో దొంగతనం జరిగింది. వివరాలు వావిళ్ళ గ్రామానికి చెందిన గుంజి నాగమ్మ ఇంట్లో తన కుమారుడు నిద్రిస్తున్న సమయంలో తలుపు తాళాలు పగలగొట్టి కష్టపడి సంపాదించుకున్న బంగారం, నగదును దోచుకు పోయారు. సంఘట నపై స్థానిక ఎస్సై పి.నరేష్ వారి సిబ్బందితో కలిసి విచారణ చేపట్టారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతి



**కోవూరు, సెప్టెంబరు9 ప్రభాతవార్త :** కోవూరు మండలం పడుగుపాడు పంచాయతీ చంద్రమౌళి నగర్ పంట కాలువలో ఓ గుర్తు తెలియని వ్యక్తి కాలువలో పడి మృతిచెంది ఉన్నాడు. ఈ మేరకు సమాచారం తెలుసుకున్న కోవూరు ఎస్సై రంగనాథ్ గౌడ్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని నిశితంగా పరిశీలించారు. మృతుని చేయి పైన జగన్‌మోహన్ అనే పేరు రాసుకుని ఉన్నాడని, సుమారు 35 సంవత్సరాల వయస్సు ఉంటుందని , నల్ల ప్యాంటు, పసుపు కలర్ చొక్కా ధరించి ఉన్నాడని ఎస్సై తెలిపారు. ఈ మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుని శరీరంపై అక్కడక్కడ గాయాలు ఉండడంతో ఎవరైనా చంపి పడవేశారా లేక మద్యం మత్తులో తాగి కాలువలో పడ్డాడా అని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## ఇంటింటా చెత్త సేకరణలో డిఎల్‌పిఓ పుట్టా రమణయ్య



**రాపూరు, సెప్టంబరు9ప్రభాతవార్త :** మండల కేంద్రమైన రాపూరు పంచాయితీలో ఇంటింటా చెత్త సేకరణ కార్యక్రమంలో మంగళవారం నెల్లూరు డివిజనల్ పంచాయితీ అధికారి డాక్టర్ పుట్టా రమణయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ప్రతి రోజు పంచాయితీ బండి వచ్చిన సమయంలో వారి ఇళ్లలోని చెత్తను చెత్తబండిలో వేయాలని కోరారు. ఇందు వల్ల పంచాయితీలో పరిశుభ్రంగా వుండ టంతో పాటు వ్యాధులు కూడా ప్రభలవని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి అట్ల కవిత, పంచాయితీ సిబ్బంది వున్నారు.

## కండలేరులో 42.520 టీయంసీల నీటిమట్టం



**కండలేరుడ్యాం(రాపూరు), సెప్టంబరు9ప్రభాతవార్త :** మండలంలోని కండలేరు జలాశయంలో మంగళవారం ఉదయం నాటికి జలాశయంలో 40 టీయంసీల నిటీ నిల్వ దాటి ప్రస్తుతం జలాశయంలో 42.520 టీయంసీల నిటిమట్టం నమోదు అయినట్లు కండలేరు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అనీల్ కుమార్ తెలిపారు. సోమశిల కండలేరు వరద కాలువ ద్వారా జలాశయంలోకి 6800 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వుండగా ,జలాశయం నుండి హెడ్ రెగ్యులేటర్ ద్వారా 985 క్యూసెక్కులు, లో లేవల్ స్లూయిస్ ద్వారా 40 క్యూసెక్కులు, హైలెవల్ స్లూయిస్ ద్వారా 100 క్యూసెక్కుల చొప్పున మొత్తం 1125 క్యూసెక్కులు అవుట్ ఫ్లోగా వెలుతున్నట్లు ఆయన తెలిపారు.

